క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్ నగర శివారులోని పలు ప్రాంతాల్లో ఈనెల 12న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ మల్లికార్జున్ తెలిపారు. బొల్లికుంట, ఖమ్మం మెయిన్ రోడ్డు, మరియాపూర్, జోగయ్యపల్లి ప్రాంతాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో 60వ వార్షిక వేడుకలు

కాజీపేట: పట్టణంలోని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో గురువారం సాయంత్రం 60వ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్యఅతిథిగా పూర్వ విద్యార్థి నిఖిత భోగా (ఐఎఫ్ఎస్) హాజరుకానున్నారని పేర్కొన్నారు.

ప్లాన్‌కు విరుద్ధంగా ఆస్పత్రి భవన నిర్మాణం

- షోకాజ్ నోటీసు జారీ

వరంగల్ అర్బన్: హనుమకొండ చౌరస్తా నుంచి పద్మాక్షి గుట్ట రోడ్డులోని బంధన్ ఆస్పత్రి భవనం నిర్మాణ ఆమోదిత ప్లాన్‌కు విరుద్ధంగా ఉన్నందున బల్దియా టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం నోటీసులు జారీ చేశారు. స్కిల్ట్, పెంట్ హౌజ్, సెట్ బ్యాక్‌లపై వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని యజమాన్యాన్ని ఆదేశించారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని వారు సూచించారు.

రైస్ మిల్లర్లపై చర్య తీసుకోవాలి

న్యూశాయంపేట: సీఎంఆర్‌ను ఎగ్గొట్టి రైతులు, ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న రైస్ మిల్లర్లపై చర్య తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ప్రభుత్వానికి అందించకుండా లాభాలకు ప్రైవేట్ మార్కెట్లో అమ్ముకుని రూ.లక్షలు అర్జించిన రైస్ మిల్లర్లకు జిల్లా అధికారులు తిరిగి వత్తాసు పలుకుతున్నారని పేర్కొన్నారు. మళ్లీ వారికే ధాన్యం సేకరణకు అవకాశం కల్పించడంలో మర్మం ఏమిటని ప్రశ్నించారు.

ఎంఎస్‌డబ్ల్యూ కోర్సును క్యాంపస్‌కు తరలించాలి



కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 16 ఏళ్లుగా కొనసాగుతున్న మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ) కోర్సును యూనివర్సిటీ క్యాంపస్‌లోకి తరలించాలని ఆ కోర్సు విద్యార్థులు కోరారు. ఈమేరకు క్యాంపస్‌లో వీసీ ప్రతాప్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థులు మానాల తిరుపతి, మాసాని ప్రదీప్, లావణ్య, సమత, సంతోష్, శ్యామల, అనిత, లోకేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాల పోటీలు



హన్మకొండ కల్చరల్: గీతా జయంతిని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హనుమకొండ నక్కలగుట్టలోని ఎస్ఎంఆర్ కళాశాలలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలను బుధవారం నిర్వహించారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్, భగవద్గీత పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ డీపీపీ జిల్లా బాధ్యులు రామిరెడ్డి కృష్ణమూర్తి, పాఠశాల ఉపాధ్యాయురాలు జోత్స్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రేటర్ నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా కస్తూరి సతీష్



వరంగల్: గ్రేటర్ వరంగల్ నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా కస్తూరి సతీష్ ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు కొడెపాక రాజేందర్, మేడిపల్లి దశరథం, నాగరాజు బుధవారం ప్రకటించారు. ఎల్‌బీనగర్‌లోని కాస్మో ఫంక్షన్ హాల్‌లో అడ్‌హక్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికలను మొదటిసారిగా బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా ఉన్న ఎలకంటి సతీష్ మృతి చెందడంతో అధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులు పోటీపడ్డారు. మంగళవారం ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటలకు పోలింగ్ జరగగా, పోలైన 730ఓట్లలో కస్తూరి సతీష్‌కు 388, మామిడాల బాలుకు 240, మేడిపల్లి కర్ణాకర్‌కు 66ఓట్లు వచ్చినట్లు వివరించారు.

సీపీఎం మండల కార్యదర్శిగా సాంబయ్య



కాజీపేట: సీపీఎం కాజీపేట మండల కార్యదర్శిగా ఓరుగంటి సాంబయ్య బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల మూడో మహాసభలను పురస్కరించుకుని జరిగిన ఎన్నికల్లో సాంబయ్యను కార్యకర్తలు ఎన్నుకున్నారు. ఈమేరకు కాజీపేటలో సాంబయ్యను పార్టీ నాయకులు అభినందించి సన్మానించారు.

జ్ఞాపకాల బెంచీ!

- మరణించిన వారి జ్ఞాపకార్థం బెంచీల ఏర్పాటు
- బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు, పార్కులు, శ్మశాన వాటికల్లో ఏర్పాటు చేసిన బెంచీలపై సేదదీరుతున్న ప్రజలు



సోమిడిలో దాతలు ఏర్పాటు చేసిన బెంచీ

కాజీపేట: తమ నుంచి దూరమైన కుటుంబ సభ్యులను తమతో పాటు ఇతరులు కూడా గుర్తుంచుకునేలా పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రధాన చౌరస్తాలు, బస్టాండ్‌లు, శ్మశాన వాటికల్లో సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేస్తున్నారు. జీవించి ఉన్నప్పుడు తమతో గడిపిన మధుర క్షణాలను బెంచీలను చూడగానే పదిమంది గుర్తుకు తెచ్చుకునేలా మృతుల సంబంధికులు బెంచీలను ఏర్పాటు చేస్తున్నారు. చనిపోయిన వారి జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు, సోదరులు, మిత్రులు బెంచీలను ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇతరుల కోసం ఏదో ఒకటి చేయాలనే ఆలోచన ఇటీవల కాలంలో ఎంతోమందికి కలుగుతోంది. ఈక్రమంలో కొంత మంది స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తుండగా.. మరికొంత మంది స్వచ్ఛంద సంస్థలకు అండగా నిలుస్తున్నారు. తమ తల్లిదండ్రులు, సోదరులు, మిత్రులు మిగిల్చిన గుర్తులను ఇతరులు కూడా జ్ఞాపకం చేసుకునేలా కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. కాజీపేట, సోమిడి, సిద్ధార్థనగర్, కడిపికొండ, ప్రశాంత్‌నగర్, మడికొండ తదితర కాలనీల్లో ఉన్న శ్మశాన వాటికలకు నిర్వాహకులు అడిగిందే తడవుగా సిమెంట్ బెంచీలను విరాళంగా అందజేస్తున్నారు. ఎవరైనా మరణిస్తే అంత్యక్రియల నిమిత్తం వచ్చే వారికి ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. కర్మలు చేసేందుకు వచ్చే వారు కూడా వాటిని వినియోగించుకుంటున్నారు. పోలీసుస్టేషన్లు, గ్రంథాలయాలు, బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు, తదితర ప్రాంతాల్లో పలువురు బెంచీలను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాలకు వచ్చే వారు ఆ బెంచీలపై కూర్చొని సేదదీరుతున్నారు. కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలో ఉన్న పలు బెంచీలపై పదవీ విరమణ పొందిన పలువురు ఉద్యోగులు, ఉదయం, సాయంత్రం వేళల్లో బెంచీల వద్దకు చేరుకుని పిచ్చపాటి మాట్లాడుకుంటూ కనిపిస్తారు. ఇలా ఎక్కడపడితే అక్కడ సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేసే సంస్కృతి ఆరేళ్ల క్రితం జిల్లాలో ప్రారంభమైంది. జిల్లాలో ఏ గ్రామానికి వెళ్లిన దాతలు ఏర్పాటు చేసిన బెంచీలు కనిపిస్తున్నాయి. దాంతో వాటిని తయారు చేసేవారికి ఉపాధి, దాతలకు సంతృప్తి మిగులుతోంది. ఈ బెంచీల్లో చిన్నవి రూ.3వేల నుంచి 4,500 వరకు లభిస్తున్నాయి. కాజీపేట పట్టణంలో సిమెంట్ ఇటుకలు తయారు చేస్తున్న వారు.. దాతల కోరిన చోట బెంచీలను ఏర్పాటు చేస్తున్నారు.



డీజిల్‌కాలనీ చౌరస్తాలో బెంచీలపై వాకర్స్

చక్కగా ఉపయోగపడుతున్నాయి



గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఏ ప్రాంతానికి వెళ్లిన దాతలు తమ కుటుంబ సభ్యుల పేరుపై ఏర్పాటు చేసిన బెంచీలు కనిపిస్తుంటాయి. పలువురు తమ వారి జ్ఞాపకార్థం బెంచీలను అందజేయడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వృద్ధులు, యువకులు వాటిపై కూర్చుని సేదదీరుతూ పిచ్చపాటి మాట్లాడుకుంటున్నారు.

– గుర్రపు కోటేశ్వర్, సోమిడి

రోజూ ఒకశ్లోకాన్ని పఠించాలి

- వేయిస్తంభాల దేవాలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ



గీతాపారాయణం చేస్తున్న విద్యార్థులు, ట్రస్ట్ సభ్యులు

హన్మకొండ కల్చరల్: దైనందిన జీవితంలో, చదువులో, సమస్యలను ఎదుర్కోవడంలో విద్యార్థులకు భగవద్గీత ఎంతో ఉపయోగపడుతుందని వేయిస్తంభాల దేవాలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ అన్నారు. గీతాజయంతి ఉత్సవంలో భాగంగా రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో దేవాలయంలో శ్రీకృష్ణుడి ప్రతిమను బుధవారం ప్రతిష్ఠించి విష్వక్సేనారాధన, పుష్పార్చన నిర్వహించి నీరాజన మంత్రపుష్పం జరిపారు. ఈ సందర్భంగా వరంగల్ శివానంద లహరి ట్రస్ట్ సభ్యులు, వివిధ పాఠశాలల విద్యార్థులు భగవద్గీత పారాయణం చేశారు. అనంతరం భగవద్గీతను కంఠస్థం చేసిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. దేవాలయాన్ని సందర్శించిన భక్తులకు భగవద్గీత పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో కాకినాడకు చెందిన ఆధ్యాత్మిక రచయిత చల్ల అరుంధరేశ్వరి, సభ్యులు విశాలక్ష్మి, శ్రీదేవి, కవిత, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలి



నినాదాలు చేస్తున్న నాయకులు, మహిళలు

ఖిలా వరంగల్: ఆశ వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల సూచించారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని ఏసీరెడ్డినగర్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు భవాని, తాటిపాముల ఉదయశ్రీ, ఈసంపెల్లి మంజుల, కాంపెల్లి అనిత, షమీనా, రజియా, ఈశ్వర్, రాజేశ్వరి, సక్కుబాయి, హేమలత, రాజక్క పాల్గొన్నారు.

రైలులో ప్రయాణికుడి మృతి

ఖిలా వరంగల్: అనారోగ్య సమస్యలతో రైలులో అస్వస్థతకు గురైన ఓ ప్రయాణికుడు మృతిచెందినట్లు వరంగల్ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ పి.సురేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం రాజస్థాన్ నుంచి చెన్నై బయల్దేరిన వీక్లీ స్పెషల్ తాంబరం ఎక్స్‌ప్రెస్‌లో తమిళనాడుకు చెందిన ఎల్.భరత్‌కుమార్.. తన తల్లి కమలాదేవి, మేనకోడలు రక్షిత సోనిగ్రతో కలిసి బయల్దేరారు. వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో భరత్‌కుమార్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఈ విషయాన్ని వరంగల్ రైల్వేస్టేషన్ జీఆర్పీ పోలీసులకు కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారు. దాంతో స్టేషన్‌లో 108 వాహన సిబ్బంది అతడి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీలకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

యోగా సాధనతో ఒత్తిడి దూరం



మాట్లాడుతున్న కమాండెంట్ రామప్రకాశ్

మామునూరు: యోగా సాధనతోనే మానసిక ఒత్తిడి దూరమై ప్రశాంతత పెంపొందుతుందని నాలుగో బెటాలియన్ కమాండెంట్ బి.రామప్రకాశ్ అన్నారు. ఖిలా వరంగల్ మండలం మామునూరు టీజీఎస్పీ నాలుగో బెటాలియన్ పరేడ్ గ్రౌండ్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ కానిస్టేబుళ్లకు యోగా, ధ్యానం, బ్రీతింగ్‌పై వర్క్‌షాపును బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ కానిస్టేబుళ్లు నిత్యం యోగా సాధన చేస్తే ఆరోగ్యవంతంగా ఉండవచ్చని అన్నారు. అనంతరం ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ బాధ్యురాలు శోభ యోగాసనాలు వేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఏసీ వీరన్న, ఆర్ఐ శోభన్, పురుషోత్తంరెడ్డి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ బాధ్యులు భాస్కర్, శ్రీలేఖ, వలంటర్లు శ్రీహర్షిణి, గోపిక, శ్రీనివాస్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

15న ముస్లిం ఉచిత వివాహ పరిచయ వేదిక



మాట్లాడుతున్న అనీస్ సిద్ధిఖీ

నయీంనగర్: సియాసత్ యాజమాన్యం, మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం వరంగల్ ఆధ్వర్యంలో ముస్లిం యువతీ, యువకులకు ఉచిత వివాహ పరిచయ వేదికను ఈనెల 15న వరంగల్ అబ్బాస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు ఫోరం కన్వీనర్ డాక్టర్ అనీస్ సిద్ధిఖీ తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సిద్ధిఖీ మాట్లాడుతూ ఆసక్తి ఉన్నవారు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు తమ తల్లిదండ్రులతో కలిసి హాజరు కావాలని సూచించారు. వివరాలకు 99087 63454 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సయ్యద్ అక్బర్, నదీమ్ బేగ్, నస్రీన్, అజారుద్దీన్, నుస్రత్ జహాన్, ఆరిఫ్, పర్వీన్ బేగం, ఆయేషా బేగం పాల్గొన్నారు.

భద్రకాళి దేవాలయంలో పూజలు



మిలింద్ పరందేకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని విశ్వ హిందూ పరిషత్ ఇంటర్నేషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మిలింద్ పరందే బుధవారం సందర్శించి అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. పూజలనంతరం ఆలయ అర్చకులు భద్రకాళి శేషు, వేద పండితులు తీర్థప్రసాదాలు, అమ్మవారి శేషవస్త్రాలు అందజేసి, మహాదాశీర్వచనం చేశారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతారావు, దేవాలయ పర్యవేక్షకుడు అద్దం విజయ్‌కుమార్, విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు ఓజనపల్లి నరసింహులు, వరంగల్ విభాగ్ అధ్యక్షుడు శ్రీరాం ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీజీఎస్పీలో గణిత ప్రతిభాపాటవ పరీక్ష



విద్యార్థులతో శ్రీనివాస్, ఉపాధ్యాయులు

మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరు టీజీఎస్పీ నాలుగో బెటాలియన్ ప్రాంగణంలోని ప్రభుత్వ జెడ్పీహెచ్ పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరం వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు గణిత ప్రతిభాపాటవ పరీక్షను బుధవారం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు హాజరై గణిత పరీక్షలో పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి కనకయ్య, గోవిందరావు, అజీజ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

హసన్‌పర్తి: కేంద్రంలోని బీజేపీ సర్కారు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. పుల్లా అశోక్ అధ్యక్షతన సీపీఎం హసన్‌పర్తి మండల 4వ మహాసభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ బీజేపీ తన మేనిఫెస్టోల్లో పేర్కొన్న విధంగా ఇంటికో ఉద్యోగం ఊసేలేదని విమర్శించారు. నల్ల చట్టాలను కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చుక్కయ్య, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా రాములు

సీపీఎం మండల కార్యదర్శిగా గుమ్మడి రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా పుల్లా అశోక్, రజిత, జూకంటి పద్మ, సతీష్, దేవరకొండ రమేష్, సుమన్, ఎండీ.అనిఫా, నాంపెల్లి మానిక ఎన్నికైనట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి ప్రకటించారు.

కార్మికులకు అదనపు పనులు వద్దు



మాట్లాడుతున్న ఉప్పలయ్య

కాజీపేట అర్బన్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్మికులతో పారిశుద్ధ్య పనులు తప్ప అదనపు పనులు చేయించవద్దని సీఐటీయూ అనుబంధం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఉప్పలయ్య అన్నారు. న్యూశాయంపేట చౌరస్తాలో మున్సిపల్ కార్మికులతో బుధవారం తెల్లవారుజామున ఉప్పలయ్య సమావేశమై మాట్లాడారు. డిపార్ట్‌మెంట్ పనులను మున్సిపల్ కార్మికులతో అధికారులు చేయిస్తున్నారని, ఇది సరికాదని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బాబు, సువర్ణ, చిన్ని, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

మోహన్‌బాబుపై కేసు నమోదు చేయాలి



నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

నయీంనగర్: మీడియా ప్రతినిధులపై దాడి చేసి విచక్షణారహితంగా వ్యవహరించిన సినీ నటుడు మంచు మోహన్‌బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రేటర్ వరంగల్ జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఈమేరకు ప్రెస్ క్లబ్ ఆవరణలో బుధవారం నిరసన తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై మోహన్‌బాబు దాడి చేసిన ఘటనను ఖండిస్తూ జర్నలిస్ట్ యూనియన్ల నాయకులు, జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు, హెల్మెట్లు ధరించి నిరసనకు దిగారు. మోహన్‌బాబుకు ఇచ్చిన పద్మశ్రీ అవార్డును కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సూచించారు. జర్నలిస్టులపై దాడి హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, జర్నలిస్ట్ సంఘాల నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

జాతీయ అవార్డు అందుకున్న లింగమూర్తి



వరంగల్: వరంగల్‌లోని కాశిబుగ్గకు చెందిన సామాజిక వేత్త, అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సౌత్ ఇండియాలో విశిష్ట సేవలు అందించిన కుసుమ లింగమూర్తి హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జాతీయ హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మన్ శ్రీనివాసరావు నుంచి భారత్ సేవారత్న జాతీయ అవార్డును బుధవారం అందుకున్నారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించి, ఎంతో కష్టపడి, ఫొటోగ్రాఫర్‌గా, మైక్రో ఆర్టిస్టుగా, సమాజ సేవకుడిగా అంచెలంచెలుగా ఎదిగిన తనను గుర్తించి ఈ అవార్డు ఇవ్వడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ జిల్లా అధ్యక్షుడు పి.శంకర్, జిల్లా సమన్వయకర్త ఓంకార శాస్త్రి, రాజేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకాష్‌కు జాతీయ పర్యావరణ అవార్డు



కాజీపేట: కె.ప్రకాష్‌కు జాతీయ ఉత్తమ పర్యావరణ అవార్డును హనుమకొండ జిల్లా కేంద్రంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులు బుధవారం అందజేశారు. కాజీపేట పట్టణానికి చెందిన ప్రకాష్.. మొక్కల పరిరక్షణ, చెట్ల నరికివేతను అడ్డుకోవడంపై పోరాటం చేస్తున్నారు.

బీఆర్ఎస్ పోరాటంతోనే రైల్వే కోచ్ ఫ్యాక్టరీ



మాట్లాడుతున్న పులి రజనీకాంత్

నయీంనగర్: కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, డివిజన్ ఏర్పాటు హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పోరాటంతోనే సాధ్యమైందని పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, కార్పొరేటర్ సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ అన్నారు. వినయ్‌భాస్కర్‌ను విమర్శించే అర్హత బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మకు లేదని పేర్కొన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో 60శాతం స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని ఢిల్లీలో దీక్ష చేసి రైల్వే మంత్రికి వినయ్‌భాస్కర్ వినతిపత్రం ఇచ్చారని గుర్తుచేశారు. కాజీపేటపై రావు పద్మకు నిజమైన ప్రేమ ఉంటే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో స్పష్టమైన ప్రకటన చేయించాలని వారు డిమాండ్ చేశారు.

మాల సంఘం అభివృద్ధికి కృషి



కాజీపేట రూరల్: కాజీపేట తేజోమయి మాలకుల సంక్షేమ సంఘం అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తామని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మర్యాల కృష్ణ, బండి విజయ్‌కుమార్ అన్నారు. కాజీపేట బాపూజీనగర్ పోచమ్మగుడి ఆవరణలో సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మర్యాల కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా బండి విజయ్‌కుమార్, కోశాధికారిగా పప్పుల గోవర్ధన్ ఎన్నికయ్యారు. ప్రస్తుతం సంఘంలో కొనసాగుతున్న కార్యవర్గ సభ్యులనే తిరిగి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కృష్ణ, విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ఉద్యమించాలని సూచించారు. కార్యక్రమంలో మాల సంఘం నాయకులు సీహెచ్.కొమ్మాలు, తండమల్ల వేణు, సిరిల్‌లారెన్స్, మైలారం శంకర్, కాశేశ్వరపు వెంకటేష్, బండి రాంచందర్, పడిదెల శేఖర్, కాలమల మహేందర్, పి.రాజేష్, బాదం కుమార్ పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న 18 మంది కానిస్టేబుళ్లు, మహబుబాబాద్‌లో పనిచేస్తున్న ఒకరికి హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పిస్తూ మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో ఏడుగురిని భద్రాది కొత్తగూడెం జిల్లాకు, ఒకరిని వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు, 11 మందిని మహబుబాబాద్ జిల్లాకు కేటాయించారు.

మహాసభను విజయవంతం చేయాలి

ఎంఎస్‌పీ జాతీయ అధికార ప్రతినిధి కుమార్



మహాసభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మంద కుమార్, నాయకులు

కేయూ క్యాంపస్: మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) ఉమ్మడి వరంగల్ జిల్లా మహాసభను వడ్డేపల్లిలోని పల్ల రవీందర్‌రెడ్డి భవన్‌లో ఈనెల 20న నిర్వహించనున్నట్లు ఎంఎస్‌పీ జాతీయ అధికార ప్రతినిధి మందకుమార్ మాదిగ తెలిపారు. ఈమేరకు మహాసభను మాదిగ విద్యార్థులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మహాసభ కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటాలకు విద్యార్థులు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ తోకల చిరంజీవి, ఎంఎస్‌పీ నాయకుడు బొడ్డు దయాకర్ మాదిగ, బాధ్యులు వేల్పుల సూరన్న, ముక్కెర ముఖేష్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కుమ్మరి శ్రీనాథ్, బాధ్యులు వడ్డెపెల్లి మధు, మారెపల్లి రాణాప్రతాప్, శివకుమార్ పాల్గొన్నారు.